# దొంగకుట్టిన తేలు

మే మాసం సూర్యుడు ఉగ్రరూపం ఉపసంహరించి గంట క్రితమే ఇన్స్పెక్షన్ బంగళామీద మాయమైనాడు. బంగళా పక్కనే ఉన్న కోమటి చెరువు అలల గాలులు ఒంటికి హాయినిస్తున్నాయి.

ఇన్స్పెక్షన్ ముగించుకొచ్చి బంగళాలో జీబుదిగేప్పుడు కంటబడి కలవరపెట్టిన మెరుపుతీగ అరవింద్ ఎదలో గిలిగింతలు పెడుతోంది

"సార్! భోజానికెల్దామా?" అడగలేక అడిగాడు స్టెనో గ్రాఫర్.

మూడు పదులు దాటని వయస్సులో మురిసిపోతున్న అరవింద్ చూపులు బంగారు గొలుసులో బిగించిన చేతి గడియారం మీదికెళ్లాయి. ఎనిమిదైంది.

"నేనిప్పుడు రాలేను. మీరెళ్ళిరండి. జీబు తీసుకెళ్ళండి" అంటూ వరండాలోకి చూస్తూండి పోయాడు.

జీబ్ వెళ్ళిపోయింది. హమ్మయ్య ... డ్రైవరు గూడా లేడు. లోపలికెళ్ళి సోఫా నాక్రమించాడు.

అరవింద్లో ఆరాటం పెరిగింది.

ఆ.... మెరుపు తీగ ఎక్కడా!"

"మంచినీళ్ళుసార్... మా నాయిన వాచ్మెన్..." తియ్యని గొంతు.

అదే మెరుపుతీగ, హంసలా అడుగులేస్తూ వచ్చింది.

వెరీనైస్.... పల్లెటూరి పిల్లే. పిటపిట లాడ్తోంది. తెల్లని కుబుసంలాంటి ఓణీ...ఊరించే అంగసౌష్టవం... ట్యూబ్లైటు వెలుగును మించిన కాంతి అమె కళ్ళల్లో ఉంది.

"నీ పేరేమిటీ?" సగం కాల్చిన సిగరెట్ పీక నులిమిపారేశాడు

"నా... పే.. రా! నాపేరు. మయూరి సార్!"

మొహం ముద్దబంతిపూవులా విచ్చుకుంది.

ఆహా.. సార్థక నామధేయురాలు! "పేరు చాలా బాగుంది "

"ఇక్కడ పెడ్తున్నాసాన్!" జగ్గుటేబుల్ మీదుంచి

'నేంబోతున్నా సార్!" వెనుదిరిగింది

"నువ్వు చాలా అందంగా. అంటే దేవకన్యలాగున్నావ్ మయూరీ!"

గుటకలువేస్తూ అభినందనాస్త్రం వేశాడు.

"హాయ్.... నిజంగానా సారూ?"

తన ఒళ్ళు తానే చూసుకుని ముడుచుకుపోయింది.

మయూరి ముందు కొచ్చాడప్పటికే.

"నిజంగా... నిజం మయూరి..." మయూరి వీపు నిమిరి కళ్ళల్లోకి చూశాడు.

"గిదేంది సారూ!" బుగ్గలు ఎర్రగులాబీలైపోయినై. పక్కకు జరిగి మూతులు తిప్పింది.

"ఏం లేదు మయూరి! నీకు మా డిపార్ట్‌మెంటులో ఉద్యోగమిప్పిస్తా.... చేస్తావా?"

"నాకా... సర్కారు నౌకరా....!" కళ్ళు అరచేతు లంతైనై.. కిలుక్కున నవ్వింది. ఆ నవ్వులో వెన్నెల వెలుగుంది.

"ఔను... నీకేఔ" అరచేతుల్తో చెంపల్ని నిమిరాడు.

"అబ్బ!.... గీ గడియారం .. శానబాగుంది. నా చెయ్యిమీద ఎట్లుంటదో!" గడియారాన్ని, చెయ్యినీ ముద్దుబెట్టుకుంది. మయూరి పెదాలు వణికినై. శ్వాసగాలి అరవింద్ చేతికి చల్లగా తగుల్తోంది.

"పెట్టుకుని చూడు!" తీసిచ్చాడు గడియారం.

"గీ ఉంగురం గూడా....!"

"ఇదిగూడా పెట్టుకో కాస్సేపు" తీసిచ్చాడు.

"హబ్బ నా చెయ్యి బంగారమోలె ఉంది గదసారూ!" కళ్ళు చక్రాల్లా తిరిగినై దోరమాగిన మామిడిపండు దోసిట్లో కొచ్చినట్టైంది అరవింద్‌కు

"ఆహా . అందమంటే నీదే సుమా!" అమాంతం చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకోబోయాడు.

"మయూరీ ఓ మయూరీ!" బయటి నుండి పిలుపు.

"అబ్బో మా అక్క పిలుస్తుంది"

సీతాకోకచిలుకలా తుర్రుమంది మయూరి.

* * * * *

"మీ గడియారమేదండీ?" క్యాంపునుండి తిరిగొచ్చిన భర్తనుండి బ్రీఫ్‌కేసందుకుంటూ అడిగింది అమల.

ఏం చెప్పాలి?.... తేలు కుంటిన దొంగయ్యాడు అరవింద్.

గబగబా డ్రెస్సు మార్చుకుని బాత్రూంలో చొరబడ్డాడు.

"గడియారమండీ. . గడియారం. పోయిన సంవత్సరం మన పెళ్లిలో మానాన్న బంగారం గొలుసు చుట్టించి కట్నమిచ్చిన గడియారం. అరె.. ఉంగరం గూడా లేదే!" ఒక చేత్తో కాఫీ కప్పు అందిస్తూ మరో చేత్తో భర్త ఉంగరం వేలందుకుంది.

"అవీ. .. అవి..." నాలుక కింద నీళ్లూరుతున్నై. కాఫీ గడగడా తాగేశాడు.

"బ్రీఫ్ కేసులో ఉందా?"

"క్కా.... కాదు సిద్ధిపేటలో పోయినై అమలా!" భార్యకళ్ళలోకి బలవంతంగా చూశాడు.

"ఎలా?" కనుబొమ్మలు ముడిపడినై.

"ఎక్కడో పడిపోయినై."

"నిలువు దోపిడీ జరిగిందన్న మాట!"

"ఆ... అంతే... ఆహ...కాదు..పడిపోయినై." జైలుకు వెళ్ళుతున్న నేరస్థుడిలా తల నేలకు వేలాడింది..

"ఐతే . బుద్ధి గడ్డితిన్న దన్నమాటా!"

"అబ్బా. నేనేం చెయ్యాలి అమలా!"

"ఏం చెయ్యాలా! పరాయి ఆడవాళ్ళను అక్కా చెల్లెళ్ళుగా చూస్తానని ఆ రోజు . నా బుగ్గగిల్లి మరీ చెప్పారు గదా! ఆమాట మీదుండాలంటాను."

"అబ్బా. దానికీ దీనికీ సంబంధమేమిటటా?" రోషం పాలపొంగులా వచ్చింది చటుక్కున్న తల పైకెత్తాడు ఆశ్చర్యం

"నాకు నౌకరిప్పిస్తారా సారూ! ఇంగో మీ గడారం ఉంగురం .." పక పకా నవ్వుతోంది మయూరి.

అదే మయూరి... కాని వేషం.

"నమస్తే బావా! నా పేరు మయూరే... వాచ్‌వెన్ కూతుర్ని కాదు. అమలక్క మా పెద్దమ్మ కూతురు. మీ పెళ్ళప్పుడు డిగ్రీ ఫైనల్ పరీక్షల్లో ఉన్నాను. పావం! మా అమలక్క మొగుడు అపరఋష్యశృంగుడను కున్నాను..."

పగలబడి నవ్వుతున్నారు అమల, మయూరి.

"మరీ.. మరి.... అక్కడ నిన్ను పిలిచిన మీ అక్కా..."

"మా అమలక్కే బావా! మాది సిద్ధిపేటనేటట్టడాం ..!"

దొంగకుట్టిన తేలైపోయిన అరవింద్ మొహాం చూడముచ్చటేసింది అక్కా చెల్లెళ్ళకు.

(అమృత్ కిరణ్ - 16-3-1995)

